వెండి ఆభరణాల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి, పోలీసులు

వినాయక్‌నగర్, జూలై 29 : వెండికి పాలిష్ చేసుకురావాలని హైదరాబాద్‌కు పంపితే మధ్యలో వాటిని చోరీ చేసిన కేసులో నిందితుడిని రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన రాహుల్ సిల్వర్ మర్చంట్ యజమాని.. తన దగ్గర పనిచేసే సునీల్, నదీమ్ అనే వర్కర్లకు 14.500 కిలోల వెండి ఆభరణాలను జూన్ 28న ఇచ్చి, హైదరాబాద్‌లో పాలిష్ చేయించుకురావాలని ట్రైన్‌లో పంపాడు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు ట్రైన్ చేరుకోగానే నదీమ్ వెండి ఆభరణాలను తీసుకొని పరారయ్యాడు. ఈ విషయాన్ని మరో వర్కర్ సునీల్ తన యజమానికి ఫోన్ చేసి తెలిపాడు. ఆయన నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో నదీమ్ సోమవారం అనుమానాస్పదంగా కనిపించడంతో రైల్వే పోలీసు సిబ్బంది అతడిని పట్టుకొని విచారణ చేపట్టడంతో నేరం ఒప్పుకున్నాడు. అతడి నుంచి వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని, నిందితుడిని రైల్వే కోర్టుకు తరలించినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

'రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు'

మాక్లూర్, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం కొందరు రైతులకే రుణమాఫీ చేస్తూ మోసం చేస్తున్నదని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. సోమవారం మానిక్‌బండార్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినా రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేదన్నారు. ఇండ్లు లేని వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచుతామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు అబ్బయ్య, కృష్ణ, ప్రశాంత్, పోతన్న పాల్గొన్నారు.

'నిందితులను అరెస్ట్ చేయాలి'

ఆర్మూర్‌టౌన్, జూలై29: తల్వేద గ్రామంలో పెద్ద పెద్దన్నపై దాడి చేయించిన అవుల్దాపురం సాయిరెడ్డితోపాటు ఇతర నిందితులను అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వామపక్ష, దళిత సంఘాల నాయకులు వెంకటేశ్, దాసు, సూర్య శివాజీ, మురళి, మూగ ప్రభాకర్, మోతె భూమన్న మాట్లాడుతూ భూమి విషయంలో మాదిగ కులానికి చెందిన పెద్దపెద్దన్నపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయించిన సాయిరెడ్డిపై ఇంతవరకూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. దళితులపై దాడులు చేస్తున్న నిందితులను పోలీసులు తప్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతుబీమా దరఖాస్తుకు ఆగస్టు 5 వరకు గడువు

కోటగిరి, జూలై 29 : రైతు బీమా పథకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి అర్హులై ఉండి, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు ఆగస్టు 5వ తేదీలోగా ఏఈవో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్ లేదా డిజిల్ సంతకం చేసిన డీఎస్ పేపర్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డ్‌ను దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు.

తెరిపినిచ్చిన వాన

ఖలీల్‌వాడి, జూలై 29 : జిల్లాలో పది రోజులుగా కురుస్తున్న వాన సోమవారం తెరిపినిచ్చింది. బంగాళాఖాతంలో అల్పపీడన ధోరణి కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. వర్షం తెరిపినివ్వడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నుంచి సోమవారం వరకు 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. బాల్కొండలో అత్యధికంగా 2.9 మిల్లీమీటర్లు, నవీపేట్‌లో 2.2, ముప్కాల్‌లో 1.9, ఏర్గట్ల 1.6, నందిపేట్‌లో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యువతి అదృశ్యం

ఎడపల్లి, జూలై 29: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గ్రామానికి చెందిన పూజ(21) ఈనెల 24న మగ్గం వర్క్‌కు సంబంధించిన వస్తువులను తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి నిజామాబాద్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో యువతి తల్లిదండ్రులు బరడి రాధ, పోశెట్టి.. బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్లంతా గుంతలమయం

ప్రయాణం నరకప్రాయం

గంగస్థాన్ ఫేజ్ – 2లో రోడ్డుపై నడవడానికి వీలులేకుండా ఏర్పడిన గుంతలు, పెద్ద పెద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

కంఠేశ్వర్, జూలై 29 : జిల్లాకేంద్రంలోని పలు రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే గుంతలు పడి, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై మోకాళ్ల లోతు గుంతలు పడడంతో, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకేంద్రం నుచి బోధన్ వెళ్లే దారిలో అర్సపల్లి, సారంగాపూర్ గోడౌన్ ప్రాంతంతోపాటు ముబారక్‌నగర్ వద్ద భారీ గుంతలు పడి, వర్షపు నీటితో నిండాయి. నగరంలోని గంగస్థాన్, సాయినగర్, వినాయక్‌నగర్, ఆర్యనగర్, దుబ్బ ప్రాంతంలో రోడ్లు మరీ దారుణంగా తయారయ్యాయి. గుంతలు పడడంతోపాటు కంకర తేలాయి. ఆ రోడ్ల మీదుగా ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగస్థాన్–2లో రోడ్లు నడవడానికి వీలు లేకుండా కొద్దిపాటి వర్షానికి చిత్తడి మారడంతోపాటు పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలుస్తున్నది. అధికారులు స్పందించి, గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోధన్ వెళ్లే దారిలో సారంగపూర్ వద్ద ఏర్పడిన గుంతలు

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

ఇందల్వాయి, జూలై 29: చంద్రాయన్‌పల్లిలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆరెట్టి రఘును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో అనంత్‌రావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో కూలీలతో మొక్కలు నాటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారని, మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకుల సమీక్షా సమావేశానికి కూడా హాజరు కాలేదని ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో విధుల నుంచి తొలగించామని వెల్లడించారు.

'తెలంగాణపై కేంద్రంవివక్ష'

ఆర్మూర్‌టౌన్, జూలై29: బడ్జెట్ కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపడం సరికాదని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు కమలాపురం రాజన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పాలిత ప్రాంతాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయమా అని మండిపడ్డారు. సమావేశంలో ఆసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'గురుపూజోత్సవం'

యోగా గురువును సన్మానిస్తున్న యోగా సాధకులు

కంఠేశ్వర్, జూలై 29 : జిల్లాకేంద్రలోని దయానంద యోగా కేంద్రంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. యోగా గురువు రాఘవ దీక్షితులు విగ్రహానికి పూలమాలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ దేవేందర్‌గుప్తా హాజరై, యోగా ప్రాముఖ్యతను వివరించారు. దయానంద యోగా కేంద్రంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. అనంతరం యోగా గురువులను సన్మానించారు.

పాతంగల్ పీహెచ్‌సీ హెచ్ఈవో బదిలీ

కోటగిరి/ పొతంగల్/ రుద్రూర్, జూలై 29 : వైద్యశాఖలో బదిలీల్లో భాగంగా ఆరోగ్య సిబ్బంది బదిలీ అయినట్లు సమాచారం. పొతంగల్ పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ జిల్లాకేంద్రంలోని డివిజన్ కార్యాలయానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో జిల్లా కేంద్రం నుంచి వెంకటరవి వచ్చారు. వెంకటరవికి నిజామాబాద్ డివిజన్ మలేరియా విభాగంలో డిప్యూటేషన్ సైతం వేసినట్లు తెలిసింది. సూపర్‌వైజర్లు జ్యోతి వర్ని పీహెచ్‌సీకి, సాయికుమారి సాలూరా పీహెచ్‌సీకి, కోటగిరి ఏఎన్ఎం శ్రీదేవి ఏఆర్‌పీ క్యాంప్‌నకు, ఎత్తొండ ఏఎన్ఎం సరోజా కోటగిరి దవాఖానకు బదిలీ అయ్యారు. ముగ్గురు సూపర్‌వైజర్లు సుజాత, సావిత్రి, సునీత ఉమ్మడి కోటగిరి మండలానికి బదిలీపై రానున్నారు. రుద్రూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణ అధికారిగా పనిచేస్తున్న రాజేందర్ మోర్తాడ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నవీపేట్ నుంచి శ్రీనివాస్ వచ్చారు. సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సావిత్రి పొతంగల్‌కు బదిలీకాగా, పొతంగల్ నుంచి జ్యోతి రుద్రూర్‌కు వచ్చినట్లు సమాచారం.

తపాలాశాఖలో సాధారణ బీమా పాలసీల ప్రీమియం సేకరణలో రాష్ట్రస్థాయిలో నిజామాబాద్ డివిజన్ జిల్లా తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డికి మొదటి బహుమతి లభించింది. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి, పోస్ట్ మాస్టర్ జనరల్ సుస్మిత ఆయనను అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. వివిధ జిల్లాల పోస్ట్‌మాస్టర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

– ఖలీల్‌వాడి, జూలై 29

తూంపల్లి సొసైటీ రైతులకు రుణమాఫీని వర్తింపజేయాలి

సిరికొండ, జూలై 29 : మండలంలోని తూంపల్లి సహకార సంఘం రైతులకు తక్షణమే రుణమాఫీని వర్తింపజేయాలని, రైతులు నష్టపోయేందుకు కారణమైన సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో రుణాలు పొందిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతోనే రుణమాఫీ పథకాన్ని పొందలేకపోయారని ఆరోపించారు. నష్టపోయిన రైతులకు సొసైటీలు బాధ్యత వహించాలని, ఎలాంటి కట్ ఆఫ్ డేట్ లేకుండా రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు దామోదర్, అనీస్, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ ఆర్టీసీ కార్గో, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా బి.పాల్

ఖలీల్‌వాడి, జూలై 29 : నిజామాబాద్ జిల్లా ఆర్టీసీ కార్గో, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా బి.పాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడలోని డివిజినల్ మేనేజర్‌గా పనిచేసిన ఆయన.. బదిలీపై నిజామాబాద్‌కు వచ్చారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'ఆరుగ్యారెంటీ'లతో మోసం

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇందల్వాయి, జూలై 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలు అమలుచేస్తున్నామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని గౌడసంఘంలో సోమవారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు నాయుడి రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అబద్ధపు మాటలు మానుకొని, ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలుచేయాలని కోరారు. రుణమాఫీ పేరిట ఎందరో రైతులను మోసం చేసిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు మఠముల శేఖర్, కుంట మోహన్‌రెడ్డి, నల్లవెల్లి చిన్ను, భోజన్న పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అవగాహన కల్పిస్తున్న ఎస్సై

బాల్కొండ, జూలై 29: మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని రహదారిపై ఎస్సై యాసిర్ అర్ఫత్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సంబంధిత పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ జయవంత్‌రావు, కానిస్టేబుల్స్ సదానంద్, సాయికుమార్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మోపాల్ (ఖలీల్‌వాడి)/ ధర్పల్లి, జూలై 28 : సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోపాల్ ఎస్సై గంగాధర్ సూచించారు. మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన దేశాల భూమేశ్‌కు వాట్సాప్ ఫేక్ కాల్ రావడంతో సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దేశాల భూమేశ్‌కు సీబీఐ ఆఫీసర్‌నని చెబుతూ ఇటీవల వాట్సాప్ కాల్ వచ్చిందని, తన మేనకోడలు మాదకద్రవ్యాల కేసులో ఇరుక్కున్నదని, కేసు నుంచి తప్పించాలంటే రూ. 50 వేలు ఇవ్వాలని, లేకపోతే చంపేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు. తన మేనకోడలికి భూమేశ్ ఫోన్ చేయగా ఇంటి వద్దనే ఉన్నానని, ఎలాంటి కేసులో ఇరుక్కోలేదని చెప్పినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విక్రమ్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫేక్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపవద్దని సూచించారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏర్గట్ల, జూలై 29: జిల్లా ఉద్యానవన శాఖ, ప్రీ యూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ వారు మండలంలోని బట్టాపూర్ గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్‌సాగుపై క్షేత్రస్థాయిలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారి రుద్ర వినాయక్, ప్రీ యూనిక్ కంపెనీ క్లస్టర్ అధికారి ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు ఈ పంట సాగుచేయాలని సూచించారు. ఈ పంట సాగు చేసే రైతుకు ఎకరానికి రూ.9000 ఎరువుల ఖర్చులకు, రూ.4200 అంతర పంట పెట్టు బడి కోసం నాలుగేండ్ల పాటు ప్రభుత్వం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. 2022లో నాటిన మొక్కలకు గెలలు వస్తున్నాయని, మొక్కల ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరిస్తున్నామని అన్నారు. మరో ఏడాదిలో జిల్లా సరిహద్దు గ్రామమైన పాక్‌పట్ల వద్ద పామాయిల్ మిల్లింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అవుతుందని, రైతులకు మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా 15 నుంచి 20 కిలో మీటర్ల పరిధిలో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రైతు కట్కం సామంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తన ఆరెకరాల భూమిలో ఆయిల్‌పామ్ పంట సాగుచేస్తున్నట్లు తెలిపాడు. రైతులు ఈ పంట సాగు వైపు దృష్టి సారించాలని అన్నారు.

రామాలయానికి సౌండ్ సిస్టం వితరణ

రజనీశ్ కిరాడ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, జూలై29: పట్టణంలోని రాంనగర్ రామాలయానికి సోమవారం సౌండ్ సిస్టం అందజేసినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యుడు రజనీశ్ కిరాడ్ తెలిపారు. భవిష్యత్తులో సౌండ్ సిస్టానికి రిపేర్లు వస్తే ఉచితంగానే చేయించి ఇస్తామన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రజనీశ్ కిరాడ్‌ను సన్మానించారు. పూజారి వెంకట రమణాచారి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాలపై పోలీసుల దాడులు

- నిషేధిత పదార్థాలు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు

నవీపేట, జూలై 29: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలపై ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు మెరుపు దాడులు చేశారు. నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకొని రెండు షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో రెండు దుకాణాల్లో నిషేధిత తంబాకు, గుట్కా తదితర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. రూ.8 వేల విలువ గల గుట్కా, తంబాకు తదితర నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. షాపుల యజమానులు వినోద్, కార్తీక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

శక్కర్‌నగర్, జూలై 29:ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్‌తో వచ్చేనెల 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి చెందిన పోస్టర్లను సోమవారం బోధన్‌లో ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు బెల్లిడిగి సుధాకర్, పట్టణ ఇన్‌చార్జి ఈరపురం పోశెట్టి మాట్లాడుతూ మాదిగలందరూ ఆందోళన కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అద్దంకి లింగన్న, తాళ్ల మహేందర్, పల్లెపోగు రమేశ్, పెద్దింటి సురేశ్, గుంజరి సాయికుమార్, బి. గౌతం, కోటగిరి లవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

నవీపేట, జూలై 29: రెండు రోజుల క్రితం అదృశ్యమైన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అశోక్ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. మండలంలోని అంజూమాన్‌ఫారం గ్రామానికి చెందిన కడారి అశోక్ ఈనెల 27న పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. తోటి స్నేహితుడికి పుస్తకాల బ్యాగ్ అప్పజెప్పి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో విద్యార్థి తల్లి జయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటి వద్ద విద్యార్థి ఉన్నట్లు గుర్తించారు. తిరిగి ఇంటికి చేసుకున్నాడని విద్యార్థి తల్లి పోలీసులకు ఫోన్‌లో చెప్పింది.

సంక్షిప్తంగా..

- **పేకాట స్థావరంపై పోలీసుల దాడి** - ఆర్మూర్‌టౌన్, జూలై29: పట్టణంలోని మామిడిపల్లికి చెందిన ఓ ప్రజాపతినిధి గెస్ట్‌హౌస్‌పై ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. గెస్ట్‌హౌస్‌లో పేకాటాడుతున్న 29 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 24 సెల్‌ఫోన్లు, రూ.1,37,000 నగదు, పది కార్లు, మూడు బైకులు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసి వారిని ఆర్మూర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.
- **ముబారక్‌నగర్‌గ్రామశివారులో..** వినాయక్‌నగర్, జూలై 29: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్ గ్రామశివారులో పేకాడుతున్న వారిని పోలీసులు అరెస్టుచేశారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి పోలీసులు దాడిచేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.3,440 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ వెల్లడించారు
- **సమస్యలు పరిష్కరించాలని 'ఆశ'ల వినతి-** రుద్రూర్, జూలై 29 : మండలకేంద్రంలోని ఆశవర్కర్లు వైద్యసిబ్బందికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆశ కార్యకర్తలు 15 రోజుల పాటు చేసిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు భూలక్ష్మి, పుష్ప, వాణి, లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.
- **బండారు దత్తాత్రేయను కలిసిన ఆర్మూర్ ఎమ్మెల్యే-** ఆర్మూర్‌టౌన్, జూలై29– ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను హైదరాబాద్‌లోని దత్తాత్రేయ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
- **నేడు దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌ల పంపిణీ-** సిరికొండ, జూలై 29 : దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్‌పాస్‌లను నేడు (మంగళవారం) పంపిణీ చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సిరికొండ బస్టాండ్‌లో బస్‌పాస్‌లను అందజేస్తామని, దివ్యాంగులు తమ ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు.
- **వారం రోజుల్లో మొక్కలు నాటే ప్రక్రియను పూర్తిచేయాలి-** కోటగిరి, జూలై 29 : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలో మొక్కలు నాటే ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ పథకం ఏపీవో గంగారాం సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీకి 4,120 వేల మొక్కలు చొప్పున మండలంలో 28 గ్రామ పంచాయతీలకు 1.15,360 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 46,121 వేల మొక్కలు (40 శాతం) నాటారని తెలిపారు. మిగతా మొక్కలను వారం రోజుల్లోగా నాటాలని సూచించారు.
- **బస్సు ఎక్కుతుండగా కిందపడిన మహిళ మృతి-** వినాయక్‌నగర్, జూలై 29 : బస్సు ఎక్కుతుండగా కాలు జారి కిందపడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ సోమవారం మృతిచెందింది. రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం బాలానగర్‌కు చెందిన నర్ర గంగామణి (35) కూలీ పనులు చేసేది. ఈ నెల 27న నిజామాబాద్‌కు వచ్చి, సాయంత్రం తిరిగి గ్రామానికి వెళ్తుండగా కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద బస్సు ఎక్కేందుకు యత్నించింది. కాలు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మహిళను చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మరణించగా.. ఆమె కుటుంబీకులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **రుద్రూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ -** రుద్రూర్, జూలై 29 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీఐ జయేశ్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో చెరువుల, కుంటల వద్దకు చిన్నారులు, యువత వెళ్లకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.
- **ఘనంగా బోనాల పండగ -** భీమ్‌గల్, జూలై 29: స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాలలో సోమవారం బోనాల పండుగ నిర్వహించినట్లు హెచ్ఎం రాస రవికుమార్ తెలిపారు. ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **ఎల్‌వోసీ అందజేత-** మోర్తాడ్, జూలై29: కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామానికి చెందిన జయవంత్ ఇటీవల ప్రమాదానికిగురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్సపొందుతున్నాడు. చికిత్సకు పెద్దమొత్తంలో డబ్బు అవసరం కావడంతో రూ.2.50లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ బాల్కొండ ఇన్